

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట: పెదగరువు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వైద్యాధికారి మోహన్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి పై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్షయ వ్యాధి ప్రాణాంతక వ్యాధి కాదని భయపడకుండా మందులు వాడాలన్నారు. రెండు వారానికి మించిన దగ్గుతో పాటు కపం, రాత్రిపూట జ్వరం రావడం, ఆకలి ముందుగించడం వంటి లక్షణాల ఉంటే వెంటనే దగ్గర్లో ఉన్న వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండమ్మ, సూపర్వైజర్ సదానందం, ఎంఎల్ హెపి రమ్య ప్రియ పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

పర్యాటక కేంద్రాల్లో ..

సదుపాయాల కల్పనకు ప్రణాళికలు

-కలెక్టర్, పర్యాటక ఛైర్మన్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు, రంపచోడవరం డివిజన్లలో రానున్న పర్యాటక సీజన్‌లో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలలో పర్యాటక వారోత్సవాల పేరుతో రెండు మూడు రోజులు ఉత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. వివిధ వస్తువల అమ్మకాల స్టాల్స్, వినోద కార్యక్రమాలు, అడ్వంచర్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గురువారం కలెక్టర్ చాంబర్ లో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాడేరు డివిజన్లో పది, రంపచోడవరం డివిజన్లో ఐదు ముఖ్యమైన పర్యాటక కేంద్రాలు గుర్తించి అన్ని మౌలిక సదుపాయాలూ కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటకుల వాహనాల పార్కింగ్, వసతి, రవాణా సౌకర్యం, ఆహార పదార్థాల స్టాల్స్, తాగు నీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి ఇతర సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రంపచోడవరం డివిజన్లో గుడిసె పర్యాటక కేంద్రం చెత్త చెదారాలతో నిండి పర్యాటకులకు అనువుగా లేకుండా పాడైపోయిందని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి, అటవీ శాఖాధికారి పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. వంజంగి ప్రాంతాన్ని పాడేరు ఐటిడిఎ పిఒ పరిశీలించాలని ఆదేశించారు. ఐటిడిఎ, ఫారెస్ట్, టిడిసి, స్థానిక సంఘాలతో కలసి విడివిడిగా లేక సామూహికంగా గమ్య నిర్వహణ ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. ఇందులో రవాణా, వసతి, ఇతర మౌలిక సదుపాయాలలో గ్యాప్స్, చేపట్టవలసిన పనులు తదితర అంశాలు ఉండాలన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన పెట్టుబడి, తద్వారా వచ్చే ఆదాయం, ఖర్చు తదిర అంశాలు పొందు పరచాలన్నారు. ఇందులో భాగంగా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ గా సంయుక్త కలెక్టర్, లీగల్ కమిటీ ఛైర్మన్ గా పాడేరు సబ్ కలెక్టర్ వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక కేంద్రాలు సందర్శించే పర్యాటకులకు అనుభూతి కలిగేలా తీర్చిదిద్దాలని సూచించారు. అధికంగా వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేట్ వాహనాలకు చెక్ పెట్టే విదంగా కమిటీ నిర్ణీత రుసుమును స్థిరీకరించి ఆ రుసుముకే పర్యాటకులను తీసుకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎం.జే అభిషేక్ గౌడ్, పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, రంపచోడవరం డి.ఎఫ్.ఓ, రవీంద్ర దామ, జిల్లా పర్యాటక అధికారి జి.దాసు, గిరిజన మ్యూజియం క్యూరేటర్ మురళి కృష్ణ, పాల్గొనగా, రంపచోడవరం నుండి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి, విశాఖపట్నం నుండి రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు..



మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

సిపిఎం నేత చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-చింతపల్లి: ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం చెందిందని, ప్రజలు ప్రజా పోరుకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ కోరారు. చింతపల్లి, జికె విధి, కొయ్యూరు మండలాల పార్టీ కార్యదర్శుల సమావేశం గురువారం చింతపల్లి సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లో ధరలు నియంత్రిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నేడు అధికారంలోకి వచ్చాక మీనమేషాలు లెక్కి స్తుందన్నారు. పెరిగిన ధరలను నియంత్రించకుండా కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ, పేద, మధ్యతరగతి ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారని మండిపడ్డారు. కూరగాయల నుంచి ప్రజలు నిత్యం వాడుకునే అన్ని వస్తువుల ధరలు పెరిగి పోతున్నాయని తెలిపారు. అధిక ధరల నియంత్రణకు ప్రజలను ఐక్యం చేసి ప్రజా పోరుబాట నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, కొయ్యూరు మండల కార్యదర్శి ఎస్ సూరిబాబు, జీకే వీధి కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబులు పాల్గొన్నారు.



పట్టుబడిన గంజాయి లిక్విడ్, నిందితునితో పోలీసులు

2 కేజీల గంజాయి లిక్విడ్ స్వాధీనం

ప్రజాశక్తి-మోతుగూడెం

రెండు కేజీల గంజాయి లిక్విడ్‌ను మోతుగూడెం పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధి పొల్లూరు ధారాలమ్మ గుడి వద్ద మోతుగూడెం ఎస్ఐ శివనారాయణ ఆధ్వర్యాన పోలీసు సిబ్బంది ముందస్తు సమాచారం మేరకు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఒరిస్సా రాష్ట్రం మల్కానగిరి జిల్లా, దిసరిగుడ గ్రామం నుండి భద్రాచలం వైపు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా, అక్రమంగా తరలిస్తున్న రెండు కేజీల గంజాయి లిక్విడ్ పట్టుబడింది. లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడు జికె.వీధి మండలం చౌడుపల్లి గ్రామానికి చెందిన పొంగి సంతోష్‌ని అరెస్ట్ చేశారు. పట్టుబడిన గంజాయి లిక్విడ్ విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని మోతుగూడెం ఎస్ఐ శివ నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోతుగూడెం పోలీసులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి



గృహ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డిఇ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండలంలో ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం గృహ నిర్మాణం పనులు వేగంగా పూర్తి చేయాలని అరకు డివిజన్ గృహ నిర్మాణం డిఈ. రాజుబాబు, అరకులోయ ఏఈ శెట్టి కాంతి అన్నారు. గురువారం మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ సంఘం వలస, దండాబాడు, పెద్దగంగగుడి, పిరిబందాలో డిఈ, ఏఈలు పర్యటించి గృహ నిర్మాణ పనులు పరిశీలించారు. సుంకరమెట్ట పంచాయతీలో సంఘంవలస గ్రామంలో లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ, అరకులోయ మండల వ్యాప్తంగా నూతనంగా 2166 గృహాలు మంజూరయ్యాయని, మొదటి విడత 1404 గృహాల నిర్మాణం చేపట్టదలుచుకున్నామని, రెండవ విడత 762 నిర్మాణాలు చేపడతామని ఆయన తెలిపారు. నిరుపేద గిరిజనులకు ప్రభుత్వం ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం ప్రవేశపెట్టిందని, ఒక గృహ నిర్మాణానికి 2లక్షల 39 వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు, గృహ నిర్మాణం చేపట్టిన మొదటి వారం రోజుల్లోనే బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందని, మంజూరైన ప్రతి ఒక లబ్ధిదారులు నూతన గృహ నిర్మాణాలు ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పివిటిజి లకు ప్రభుత్వం ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం గృహ నిర్మాణాలు మంజూరు చేస్తుందని ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. గృహ నిర్మాణం పనులు వేగంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఏ మజ్జి నాగేశ్వరరావు, సుంకరమెట్ట సర్పంచ్ చిన్నబాబు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిఐ సన్యాసినాయుడు

విద్యార్థులు సంకల్పంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల లో గురువారం సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సంకల్పంతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. సైబర్ నేరాలపై సీఐ అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడటంతో అనర్థాలు జరుగుతాయన్నారు. ఏమైనా సమస్యలు వస్తే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. సాయంత్రం వేళలో పెట్రోలింగ్ కూడా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ

నేడు విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద నిరసనలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విఆర్.పురం

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ, ప్రభుత్వం తీసుకొచ్చే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 18న విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద జరుగు నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని రేఖపల్లిలో బొప్పెన భీమయ్య భవనంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసరాలు ధరలు భారీగా పెరగడం వలన ఆర్థిక భారాలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటువంటి సమయంలో ఇంధన సర్దుబాబు, ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఉందని పేర్కొన్నారు. మరో వైపు ఉన్న విద్యుత్ మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు పెట్టడానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం సరికాదని, తక్షణమే స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, నాయకులు పులి సంతోష్ కుమార్, పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, పూనెం ప్రదీప్ కుమార్, గుండిపూడి లక్ష్మణరావు, కమ్మచిచ్చు సత్యనారాయణ, పోడియం శ్రీరామ్మూర్తి, శ్రీరపు తాతబాబు, నాలారపు ప్రకాష్ రావు, వేటగాని సూరి తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

మత్స్యగెడ్డలో వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు: మండలంలో దారెల గ్రామ పంచాయతీ పెద్ద పేట గ్రామ మత్స్య గెడ్డలో గురువారం నాటు పడవ లో ప్రయాణిస్తూ వ్యక్తి గల్లంతయినట్లు స్థానిక ఎస్సై రవీంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. పెదబయల మండలం సీతగుంట పంచాయతీ రోగుల గ్రామానికి చెందిన కొర్ర వేణుగోపాల స్వామి (25) గురువారం ఉదయం 9 గంటల సమయంలో రోగుల గ్రామం నుండి ముంచింగిపుట్టు మండలం దారెల పంచాయతీ పెద్దపేట గ్రామంలో వ్యవసాయ పనిముట్లను సాన పట్టించడానికి నాటుపడవ పై బయలు దేరాడు. పెద్ద పేట గ్రామ సమీపంలోనీ సుమారు 50 మీటర్ల దూరంలో ఉండగా నాటు పడవలో పూర్తిగా రంధ్రం ఏర్పడి నీరు ప్రవేశించడంతో పడవ మునిగి గల్లంతయ్యాడని తెలిపారు. సీతగుంట పంచాయతీ రోగుల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సీత గుంట పంచాయతీ సర్పంచ్ మాధవరావు సంఘటన స్థలంలో చేరుకొని పోలీసులకు, పిఒ, కలెక్టర్ కు ఫోను ద్వారా సమాచారం అందించారు. స్థానికులు, ఈతగాళు గాలింపు చర్యలు చేపట్టారు. తహశీల్దార్ నరసమ్మ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విద్యుత్ అంతరాయంతో అవస్థలు

ప్రజాశక్తి -చింతపల్లి: మన్య ప్రాంతంలో చిన్నపాటి వర్షానికి, చిరుగాలులకు విద్యుత్ అంతరాయం ఏర్పడడం పరిపాటి. అటువంటిది ఎటువంటి గాలులు లేకుండానే గురువారం ఉదయం చింతపల్లిలో ఏర్పడిన విద్యుత్ అంతరాయం రాత్రి ఆరు గంటల వరకు ఉండటంతో స్థానికులు అవస్థలు పడ్డారు. అంతర్జాల సేవలు మూగబోయాయి. ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి.



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్

బ్యాంకు సేవలపై అవగాహన

ప్రజాశక్తి- ముంచింగి పుట్టు: మండలంలోని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమ యోజన పథకం, బ్యాంకు సేవలపై మేనేజర్ సురేష్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని జర్రెల గ్రామ పంచాయతీకి చెందిన డేగలపుట్టు గ్రామానికి చెందిన సీసా మునిమకు తమ బ్యాంకులో భీమా ఉందని, ఆమె మృతి చెందడంతో గురువారం రెండు లక్షల భీమాను కుటుంబ సభ్యులకు మంజూరైయిందని తెలిపారు. ఏపీజీవీబీలోని లావాదేవీలు, వడ్డీ తక్కువ, ఖాతాదారుల డిపాజిట్ లపై తెలిపారు. ఈ చెక్కును పంచాయతీ సర్పంచి బలగం భాగ్యవతి, బీఎస్పీ నాయకులు మాధవరావుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్పి వంతల భగత్ రామ్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

బేస్ లైన్ అసెస్మెంట్ శిక్షణలో ఐటిడిఎ పిఒ ఆదేశం




మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని చదువులో వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని చదువులో మెరుగుపర్చాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో 174 మంది ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న బేస్ లైన్ అసెస్మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ అధికారి సింహాచలం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని చదువులో వెనకబడ్డ విద్యార్థులను గుర్తించి బేస్ లైన్ టెస్ట్ ద్వారా ఎబిసిడిలుగా విభజించడం జరుగుతుందని చెప్పారు. ఇలా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి బి గ్రేడ్‌కు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ప్రతిరోజు విద్యార్థులు ఏ స్థాయిలో చదువుతున్నది ఎప్పటికప్పుడు ఉపాధ్యాయుల పరిశీలించాలని సూచించారు. తెలుగు, ఇంగ్లీష్, లెక్కల సబ్జెక్టులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు బోధించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శి అనే ప్రోగ్రాం ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ పాస్ అయిన తర్వాత టెక్నికల్ కోర్సులు చదివే విధంగా అన్ని మండలాల్లోని మాస్టర్ ట్రైనర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణ, రిసోర్స్ పర్సన్స్ సాయిబాబా, టాల్ స్టోయ్, ఎమ్మార్పీలు పాల్గొన్నారు.

పలువురు అధికారులు బాధ్యతల స్వీకరణ





బాధ్యతలు స్వీకరిస్తున్న మారేడుమిల్లి ఎంపిడిఒ శ్రీనివాస్ విశ్వనాథ్, వై.రామవరం, కొయ్యూరు తహశీల్దార్లు వేణుగోపాల్, కుమారస్వామి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండల అభివృద్ధి అధికారిగా తూటిక శ్రీనివాస్ విశ్వనాథ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీనివాస్ ఏలూరు డిపిఒ (ఎఫ్ఎసి)గా పనిచేస్తూ బదిలీపై మారేడుమిల్లి ఎంపీడీవోగా వచ్చారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఎ.వీర కిషోర్ వైఎస్ఆర్ కడప జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో తూటిక శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏమైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

వై.రామవరం : వై.రామవరం మండల తహశీల్దారుగా పి.వేణుగోపాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలం తహశీల్దారుగా కుమారస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల నుంచి రెవెన్యూ కేంద్రానికి విచ్చేసిన గిరిజనుల పట్ల ప్రేమ అభిమానం ఆప్యాయతలు చూపిస్తూ వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారం చేస్తామని చెప్పారు.

బదిలీ అధికారులకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం తహశీల్దారుగా పని చేసి ఏలూరు జిల్లా పెదపాడు మండల తహశీల్దారుగా బదిలీపై వెళ్తున్న ఎ.కృష్ణజ్యోతిని, మండలం ఇన్‌ఛార్జి తహశీల్దారుగా పని చేసి కాకినాడ జిల్లా తుని మండలం సివిల్ సప్లై ఎమ్ఎస్ఒగా వెళుతున్న బి.రాజును బుధవారం రాత్రి స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ ఆత్మీయ సమావేశంలో నూతన ఇన్‌ఛార్జి తహశీల్దారు ఏఎస్వి సత్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రజలకు మంచి సేవలు అందించితే ఎక్కడికి వెళ్లినా మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. బదిలీ అయిన తహశీల్దారు కృష్ణ జ్యోతి మాట్లాడుతూ గత ఎన్నికల్లో అన్ని కేటగిరీలకు సంబంధించిన అధికారులు సిబ్బంది ఎన్నికల ప్రశాంతంగా జరిగే విధంగా బాగా పనిచేయడం జరిగిందని, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



రైతులతో కలిసి క్షేత్రసాయి పరిశీలన చేస్తున్న వ్యవసాయ అధికారి, సిబ్బంది

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని కించవానిపాలెం, కొయ్యూరు రైతు సేవా కేంద్రాల్లో మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి ఆధ్వర్యాన గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాక్టీరియల్ ఎండు తెగులు, దోమపోటు తెగుళ్లను గమనించారు. ఎండుతెగులు సోకినప్పుడు మొక్కలు వర్ణంలోనికి మారి ఎండిపోవడం జరుగుతుందని, నివారణకు యూరియా వాడకూడదని పేర్కొన్నారు. దోమ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.25 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ పశువులకు సంబంధించిన వ్యాధుల గురించి వివరించారు. వచ్చే నెల 15 తేదీ నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్, రైతులు కోరారు. కార్యక్రమంలో సంబంధిత గ్రామ సర్పంచులు త్రినాథ్, పడాల్ మాజీ ఎంపీటీసీ శివరామరాజు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, విహెచ్ఎలు ప్రభాకర్, రూప పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పంచాయతీల్లో పారిశుధ్యం లోపిస్తే సహించేది లేదని, పంచాయతీ అధికారులు పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో యాదగిరిశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ఎంపీడీవో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధులు, రోడ్లు, సంస్థలు, శ్మశాన వాటికలు శుభ్రపర్చాలని సూచించారు. వాటర్ ట్యాంక్స్ క్లీనింగ్, క్లోరైనేషన్ చేయుట, ఫ్రైడే డ్రై డే పాటింపు తదితర విషయాలపై సమీక్షించారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎంపిడిఒ, సచివాలయాల సిబ్బంది

ఘనంగా వాల్మీకి జయంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పిఒ అభిషేక్ తదితరులు

ప్రజాశక్తి-పాడేరు: మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ బి.పద్మావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐటీడీఏ కార్యాలయంలో ఐటిడిఏ పిఓ, వి.అభిషేక్, సహాయ ప్రాజెక్ట్ అధికారులు వి.ఎస్ ప్రభాకర్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం రాజు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, ఐటీడీఏ అకౌంట్ అధికారి శ్రీనివాస్ కుమార్, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : స్థానిక ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. సహ పరిశోధన సంచాలకులు అప్పలస్వామి మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి జీవన విశిష్టత, ఉన్నతిని వివరించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యప్ప రెడ్డిచ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటేష్‌బాబు, జోగారావు, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

రంపచోడవరం : వాల్మీకి జయంతి సందర్భంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి రామాయణం అనేది గొప్ప గ్రంథమని, దానిని అందరూ చదివి అవగాహన చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఐటిడిఏ ఏపిఓ జనరల్ డిఎన్వి రమణ, ఎస్ఓ టి.మార్తమ్మ, పిహెచ్ఓ చిట్టిబాబు, ఉపాధి హామీ పథకం ఏపీడి జి. శ్రీనివాసరావు, జిసిసి డివిజనల్ మేనేజర్ జి. పార్వతీశ్వరరావు, ఎడియంహెచ్ఓ జి. శిరీష, సిడిపివోలు సంధ్యారాణి, ప్రసన్నలక్ష్మి, లక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మండలం కేంద్రంలోని వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి సంఘ నాయకులు, మాజీ సర్పంచ్ రంజని దేవి, గొర్ల భవాని శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ ఏనుగుబయలు గ్రామం సీతారాముల ఆలయం వద్ద వాల్మీకి మహర్షి చిత్రపటానికి స్థానిక సర్పంచ్ ఎం.రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి వాల్మీకి నగర్‌లో గిరిజన ప్రతిభ యువశక్తి ఆధ్వర్యంలో విశ్రాంతి ఉపాధ్యాయుడు వజ్రపు చిన్నబ్బాయి ఆధ్వర్యాన వాల్మీక జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, ఆదివాసి నాయకులు వజ్రపు అప్పారావు, రాజబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో..



కాఫీ యంత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి
కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : గిరిజన కాఫీ అద్భుతంగా ఉందని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని గెడ్డం పుట్టు గ్రామంలో ఉన్న మన్య తోరణం రైతు ఉత్పత్తి దారుల కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ను గురువారం సందర్శించారు. కాఫీ పళ్ల సేకరణ, పల్పింగ్, క్యూరింగ్, రోస్టింగ్, గ్రైండింగ్, కాఫీ పొడరు తయారీ, డికాక్షన్ తయారీని పరిశీలించారు. అనంతరం కాఫీ కమ్మదనాన్ని రుచి చూసి తయారీ దారులను అభినందించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల కార్యక్రమాలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాఫీ మార్కెటింగ్ విస్తరణకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గిరిజన కాఫీని విస్తరించడానికి ప్రమోట్ చేయడానికి 50 మంది గిరిజన యువకులకు శిక్షణ అందించాలని అన్నారు. కాఫీ ఉత్పత్తదారులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేస్తామన్నారు. కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి కషి చేస్తామని పేర్కొన్నారు. గిరిజన రైతులు పూర్తిగా పక్వానికి వచ్చిన కాఫీ పళ్లను మాత్రమే సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు ఉప సంచాలకులు సమాల రమేష్ మన్యతోరణం రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధి వెంకట రమణ, తుంపాడ, గెడ్డంపుట్టు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడితో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఎలుగు దాడిలో గాయపడ్డ లక్ష్మి

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండలంలోని గుంటగన్నెల పంచాయితీ పిత్తగుడ గ్రామంలో ఎలుగుబంటి దాడిలో ఇద్దరు గిరిజనులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి వివరాలు... ఆ గ్రామానికి చెందిన కిల్లో లక్ష్మి, కిల్లో కేశవరావు గ్రామానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలోని కాఫీ తోటల పనుల నిమిత్తం గురువారం ఉదయం వెళ్లారు. అకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేయడంతో వారిద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న వారి కుటుంబీకులు హుటాహుటిన అంబులెన్స్ లో డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్య సేవలు అందించి అరకులోయ ప్రాంతీయ హాస్పిటల్ కు తరలించినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు.

విశాఖలో అమెజాన్ ఫ్రెష్ అమ్మకాల జోరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అమెజాన్ ఇండియా గ్రేట్ ఫెస్టివల్ సమయంలో విశాఖపట్టణంలో అమెజాన్ ఫ్రెష్ అమ్మకాలు అత్యంత వేగంగా జరిగాయని సంస్థ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీ రామ్ చెప్పారు. నోవాటేల్ హోటల్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమెజాన్ ఫ్రెష్ 2024లో 2.3 రెట్ల ఇయర్-ఆన్-ఇయర్ వృద్ధిని సాధించిందన్నారు.

ఐటిడిఎ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో...

మద్యం షాపు నిర్వహిస్తే ఆందోళన

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి- అరకులోయ: ఐటీడీఏ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మద్యం షాప్ నిర్వహిస్తే ఆందోళన చేపడతామని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నిరుద్యోగుల కోసం పాడేరు ఐటీడీఏ అరకులోయ గిరిజన సంస్కతిక మ్యూజియం ఎదురుగా కమర్షియల్ వాణిజ్య సముదాయం నిర్మించిందని ఆయన అన్నారు. ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఇప్పుడు బినామీ పేర్లతో బ్రాందీ షాపులు దక్కించుకున్న గిరిజనేతరులు బ్రాందీ షాప్ ఓపెనింగ్ కి ఏర్పాట్లు చేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుందన్నారు. నిరుద్యోగులకు కేటాయించిన షాపులు వారే వ్యాపారాలు కొనసాగించి ఉపాధి పొందాలని, బినామీ గిరిజనేతరులకు, ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వకూడదని ఐటిడిఏ నిబంధనలు పెట్టినప్పటికీ, వాటిని బేఖాతరు చేయడం సబబు కాదని తెలిపారు. ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్‌లోనే పార్కింగ్ ప్లేస్ కూడా ఉండడంతో అన్ని వేళలు పర్యాటకులు, స్థానికులు, వాహన చోదకులతో రద్దీగా ఉంటుందని ఇటువంటి ప్రదేశంలో వైన్ షాపులు నిర్వహణ చేపడితే ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని చెప్పారు. అరకు లోయలోని లాడ్జిల, యజమానులు టెంట్ నిర్వాహకులతో బుధవారం పాడేరు ఐటిడిఏ పిఓ అభిషేక్ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లో వైన్ షాపులు నిర్వహించకూడదని స్పష్టం చేశారని ఆయన తెలిపారు. ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్‌లో వైన్ షాప్ ప్రారంభించడానికి జరుగుతున్న ఏర్పాట్లపై అల్లూరి జిల్లా కలెక్టర్‌కు, ఐటిడిఏ పిఓకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. బినామీ పేర్లతో షాపులు నిర్వహణకు వస్తున్న గిరిజనేతరులకు గిరిజనులు తమ షాపులు ఇవ్వవద్దని సూచించారు. జనాలు రద్దీగా ఉండే ప్రదేశంలో బ్రాందీ షాపులు నిర్వహణకు అనుమతి ఇవ్వద్దని అధికారులకు ఆయన కోరారు.

మత్తు వైద్యాధికారిని నియమించాలి

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి పెద్దాసుపత్రిలో మత్తు వైద్యాధికారిని నియమించాలని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ, చింతపల్లి, జి.కే వీది మండలాలకు సంబంధించి చింతపల్లి పెద్దాసుపత్రిలో యంత్ర పరికరాలున్నా, మత్తు (ఎనస్తీసియా) వైద్యులు లేక ఎముకలు విరిగిన రోగులను జిల్లా కేంద్రమైన పాడేరుకు తరలించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. స్థానిక ఆసుపత్రిలో నిపుణులైన ఎముకల వైద్యులు ఉన్నప్పటికీ శస్త్ర చికిత్సలు చేసేందుకు మత్తు (ఎనస్తీసియా) వైద్యులు లేక శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో ఇద్దరు వైద్యులు ఉన్నప్పుడు అందిన సేవలు కూడా నేడు పదిమంది వైద్యులు ఉన్నా అందని ద్రాక్షగా మారాయన్నారు. మత్తు వైద్యాధికారిని వెంటనే నియమించాలని ఈ



శంకుస్థాపన చేస్తున్న నేతలు

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పల్లే పండుగ కార్యక్రమంలో భాగంగా ఖండ్రుమ్ పంచాయితీ ఓంబి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులను టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్.దోన్నుదొర గురువారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు సౌకర్యం లేని మారుమూల గ్రామంలో రోడ్డు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి పాల్గొన్నారు.

'పల్లె పండుగలో ప్రోటోకాల్ పాటించ లేదు'

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమంలో అధికారులు ప్రోటోకాల్ పాటించ లేదని ఖండ్రుమ్ పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ పోరం మండల అధ్యక్షుడు కే.హరి ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పంచాయితీలో రోడ్డును గురువారం అధికారులు, కూటమి నాయకులు ప్రారంభించారన్నారు. స్థానిక సర్పంచ్‌ను ఆహ్వానించకుండా కూటమి నాయకులే ప్రారంభించుకున్నారని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణానికి వైయస్సార్ ప్రభుత్వం హయంలోనే నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు.

నిమ్మచెట్టు వాగుపై వంతెన నిర్మించాలి



వాగు దాటుతున్న నిమ్మచెట్టు గ్రామస్తులు.

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి నిమ్మచెట్టు గ్రామం వద్ద వాగుపై వంతెన నిర్మించాలని సిపిఎం మండల నాయకులు బాకూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ గత నెల 8న సంభవించిన పెనువిపత్తుకు నిమ్మచెట్టు-దారకొండ మధ్య రహదారి అస్తవ్యస్తంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని వాపోయారు. అధికారులు నిమ్మ చెట్టు గ్రామంలో అరకొర సమాచారం సేకరించి వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు తమ గ్రామాలు వైపు చూసే వారే లేరని మండిపడ్డారు. రాకపోకలు సాగించడానికి వాగుపై వంతెన లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు గురవుతున్నామని పేర్కొన్నారు. అనేకసార్లు అధికారుల దృష్టి తీసుకెళ్లిన వాగుపై వంతెన నిర్మించడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. వర్షాకాలం సమయంలో వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో అవతల ఒడ్డుకు చేరాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా అనారోగ్యం పాలైతే వైద్య సేవ నిమిత్తం దారకొండ పిహెచ్సికి రోగిని వాగు దాటించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. వాగు మధ్యలో తాత్కాలికంగా పెద్ద పెద్ద రాళ్లు వేసి దాని పైనుంచి అవతల ఒడ్డుకి అతి కష్టం మీద ప్రజలు దాటవలసి వస్తుందని తెలిపారు. నిమ్మచెట్టు గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు.

రతన్ టాటాకు కళాసేవాపీఠం నివాళి

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఇటీవల మృతి చెందిన పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు గోపాలపట్నం కళాసేవాపీఠం గురువారం ఘనంగా నివాళులర్పించింది. రతన్ టాటా చిత్రపటానికి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టాటా గ్రూప్ చైర్మన్‌గా ఉన్నతమైన విలువలు పాటించే మహోజ్వలమైన పారిశ్రామికవేత్తను భారతదేశం కోల్పోయిందన్నారు. టాటా ఇండికా, టాటా నానో కార్లను ప్రవేశపెట్టి మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన గొప్ప దార్శనికడని కొనియాడారు. కరోనా సమయంలో రూ.1500 కోట్లను కేంద్ర ప్రభుత్వానికి విరాళంగా అందజేశారని, ముంబయి తాజ్‌హోటల్‌పై దాడి ఘటనలో తీవ్రవాదుల చేతిలో మృతి చెందిన టాటా ఉద్యోగుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిచ్చి ఆదుకున్న మానవతావాది రతన్ టాటా అని ప్రశంసించారు. కార్చక్రమంలో కళా పీఠం అధ్యక్షులు రామదాసు, మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, కార్యదర్శి నూకరాజేశ్వరరావు, సభ్యులు వల్లూరి జగదీష్, చంద్రశేఖర్, విశ్వేశ్వరరావు, టి. రామచంద్రరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : మారేడుమిల్లి 33కెవి ఫీడర్ పరిధిలో లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు (ట్రీ కటింగ్) నేపథ్యంలో మారేడుమిల్లి మండలం పరిసర ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియేల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాతీయ యువజనోత్సవాలకు ఎయు విద్యార్థులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జాతీయ యువజన ఉత్సవాలు ప్రజాతంత్ర 2024కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఎం.శివాని లహరి, డి.హర్షిత ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు.. వచ్చేనెల 16 నుంచి నవంబర్ 18 వరకు లక్నోలో జరిగే యువజన ఉత్సవాలలో వీరిరువురు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ ఇండియా సంయుక్తంగా ఈ వేడుకను నిర్వహిస్తున్నాయి. 22 రాష్ట్రాలు,రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 124 మంది విద్యార్థులు యూత్ ఫెస్టివల్‌లో పాల్గొంటున్నారు. ఇటువంటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో రాష్ట్రం నుంచి ఎయుకు చెందిన ఎం శివాని లహరి, డి హర్షిత ఎంపిక కావడంపై విసి ఆచార్య జి. శశిభూషణరావు సంతోషం వ్యక్తం చేశారు. గురువారం తన కార్యాలయంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్. కిషోర్‌బాబు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్ హరినాథ్, డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎయు విసి ఆచార్య శశిభూషణరావు

ఇంటి వద్దకే నేత్ర వైద్య సేవలు



మొబైల్ నేత్ర వైద్యసహాయకుడు

ప్రజాశక్తి - ఆరిలోవ : వృద్ధులు, కదలలేని స్థితిలో ఉన్న కంటి రోగుల సమగ్ర నేత్ర సంరక్షణలో భాగంగా ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, స్టాండర్డ్ ఛార్టర్డ్ భాగస్వామ్యంతో ఇంటి వద్దకే కంటి వైద్యసేవలను అందిస్తున్నట్టు సంస్థఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డాక్టర్ ప్రశాంత్ గర్గ్, స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంక్ సస్టెయినబిలిటీ అధిపతి కరుణా భాటియా తెలిపారు. 'సీయింగ్ ఈజ్ బి లివింగ్' కార్యక్రమంలో భాగంగా ఎల్‌విపిఇఐ@ హోం సేవల సంస్థకు ఒక ఫోన్‌కాల్ ద్వారా రిజస్టర్ చేసుకుని ఇంటివ ద్దే వైద్యసేవలను పొందవచ్చన్నారు.

శిక్షణ పొందిన ఒక విజన్ టెక్నీషియన్ లేదా ఆప్టోమెట్రిస్ట్ రోగి ఇంటిని సందర్శించి సమగ్ర కంటి పరీక్ష చేస్తారని, రోగ నిర్ధారణ, నిర్వాహణ ప్రణాళిక, ప్రిస్కిప్షన్, తరువాత సందర్శన వివరాలతో కూడిన వైద్య నివేదికను రోగి ఫోన్ నెంబరుకు పంపుతారన్నారు. అర్హులైన నిరుపేద వృద్ధులకు ఉచితంగా కళ్ళద్దాలను కూడా అందిస్తామన్నారు. శస్త్రచికిత్స అవసరమైతే సమీపంలోని ఎల్‌విపిఇఐకేంద్రానికి వెంటనే తరలించి చేయిస్తారన్నారు.

నోటి కేన్సర్‌కు అరుదైన ఆపరేషన్

ప్రజాశక్తి- మధురవాడ : నోటి కేన్సర్ బాధితునికి గీతం దంత వైద్యకళాశాల ఆసుపత్రి, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్య నిపుణుల బృందం విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించింది. వాల్తేర్‌కు చెందిన బి.రామారావు నాలుక వెనకభాగంలో నెల రోజులుగా తీవ్రమైన నొప్పితో బాధపడుతూ గీతం ఆసుపత్రిలో చేరారు. వైద్య పరీక్షలలో నోటి అల్సర్‌ను గుర్తించిన వైద్యనిపుణుల బృందం, నమూనాలను సేకరించి, బయాప్సికి పంపగా నోటి కేన్సర్‌గా నిర్ధారణ అయ్యింది. నాలుకపై కేన్సర్ ప్రభావిత ప్రాంతాన్ని ఆపరేషన్‌చేసి తొలగించాలని నిర్ణయించిన వైద్యనిపుణుల బృందం, జిమ్‌సర్ ఇఎన్‌టి వైద్యులు డాక్టర్ యుగంధర్, గీతం దంత కళాశా ఓరల్ అండ్ మాక్సియో ఫేషియల్ సర్జరీ స్పెషలిస్ట్ డాక్టర్ రూపా గంట, డాక్టర్ సతీష్, డాక్టర్ సౌజన్య, విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి, కేన్సర్ ప్రభావిత ప్రాంతాన్ని తొలగించారు. అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్యబృందాన్ని జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి అభినందించారు.

ఈ సందర్భంగా వైద్యనిపుణులు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు ముఖ్యంగా సిగరెట్, బీడి, చుట్టలతో పాటు గుట్కా, ఖైనీ, జర్దా వినియోగించే వారిలో నోటి కేన్సర్ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. నోటి కేన్సర్‌పై అవగాహనకు, రోగులకు ఉచిత కౌన్సిలింగ్ ఇవ్వడానికి గీతం దంత వైద్యకళాశాల ఆసుపత్రిలో ప్రత్యేక విభాగాన్ని నిర్వహిస్తున్నామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఆపరేషన్ చేస్తున్న ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు

గ్రామాల్లో 'పల్లె పండుగ'



రాజేంద్రపాలెంలో పల్లెపండుగలో ఎంపిపి, సర్పంచ్ తదితరులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెంలో గురువారం పలె పండుగ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి కూటమి నాయకులు రూ.9 లక్షలతో శ్మశాన వాటికకు సిసి రోడ్డు, గ్రామంలో ఒక సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, రాజేంద్రపాలెం సర్పంచ్ పీత సింహాచలం, కూటమి నాయకులు గూడెం లక్ష్మణ్, సిగ్గే భావనసాయి జయంతి, పీట సుధీర్ బాబు, గూడెం శేషుబాబు, షేక్ ఖాన్, వై.వరహాలబాబు, దిబ్బ రత్నం, ఫీల్డ్ అసిస్టెంట్ బల్ల ప్రసాద్ మాజీ సర్పంచ్ కంచం వీరబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండలంలోని పుల్లంగి పంచాయతీలో సర్పంచ్ జార్జిబాబు ఆధ్వర్యంలో గురువారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. గోకులం షెడ్స్, పండ్ల తోట అభివృద్ధి, పంట కాలువలు పునరుద్ధరణ వంటి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పుల్లంగి పంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.03 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి కిషోర్ బాబు, సచివాలయం సిబ్బంది, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ జార్జిబాబు

కొమరం భీమ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-రంపచోడవరం : గిరిజనోద్యమ నాయకుడు, తెలంగాణ విముక్తి కోసం పోరాడిన కొమరం భీమ్ 84వ వర్ధంతి ఆదివాసీ జెఎసి నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ కొమరం భీమ్ ఆనాడు జల్ జంగిల్ జమీన్ నినాదంతో అమాయక ఆదివాసీలను చైతన్య పరిచి ఆదివాసీల స్వయంపాలనే లక్ష్యంగా పోరాటం సాగించారని గుర్తు చేశారు. నేటితరం యువతీ యువకులు కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీల స్వయం పాలన రాష్ట్రం సాధించినప్పుడే ఆయనకు నిజమైన నివాళులు అర్పించినట్టు అవుతుందని చెప్పారు. జెఎసి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- రంపచోడవరం: జిఎస్ఆర్ ఫౌండేషన్, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, ట్రస్టీ నారా భువనేశ్వరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ రంపచోడవరం మండలం, దిరిసినపల్లి గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దిరిసినపల్లి గ్రామానికి చెందిన రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోసు నాగన్న దొర, కందుల సాయిబాబు, కంగల అబ్బాయిదొర, కుంజం రామకృష్ణ దొర, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.